
కథ



# శతపోరు

వడలి రాధాకృష్ణ

''మొత్తానికి చపలానికి చురుకెక్కువే''

కిసుక్కుమని నవ్వాడు గోలయ్య.

''చురుకును తీసి గట్టును పెట్టు. చూరులోని చుక్కలు చురుక్కుమనిపిస్తున్నాయి''

ఏదో పెద్ద ప్రాస కనిపెట్టినట్టు ఫీలవుతున్నాడు చపలం.

''డబ్బింగ్ సిన్మాకి మాటలు రాయడానికి పోతే సరి!''గోలయ్య సగం మిగిలిన బట్ట బుర్రను గోక్కుంటూ అన్నాడు.

గోల చేయడం గోలయ్యకి బాగా సరదా. చపలం దగ్గరకొచ్చేసరికి పరమ గోలయ్య అయిపోతుంటాడు. అమ్మనాన్నలు బియ్యంలో రాయించిన చలం కాస్తా సంచలనమై చివరగా చపలం దగ్గర ఆగిపోయింది. అప్పుడప్పుడు అయినవాళ్ళు చపల చిత్తుడంటూ ఉడికిస్తుంటారు.

''ఏమిటోయ్! ఆఫీసర్‌గారి ఇంటిదగ్గరకొచ్చేసరికి సైకిల్ మొరాయిస్తోంది రోజూ...''

''చైను తెగిపోతోంది. చైను సుత్తి కొట్టమాక!''

''మేనేజర్‌గారు రమ్మంటున్నారు'' దాకయ్య అనబడే ఆఫీసు ప్యూను హడావుడిగా వచ్చాడు. లింగారావు గారి నుండి పిలుపు వచ్చిందంటే చపలానికి వీపుమీద చరిచినట్లయింది.

''పిలిచినప్పుడు వెళ్లక ఛస్తాడా.. వెళ్లకబోతే ఛస్తాడుగాని...'' మొదట్లో తడబడ్డాడు. తర్వాత తట్టుకున్నాడు.

'రెండు సుత్తుల తుత్తి భాగోతం' డాకయ్య నోట్లోనే గొణుక్కున్నాడు.

'కాబోయే అల్లుడు, మావ. జంట సుత్తులు. వెళ్ళు వెళ్ళు సుత్తుల జంట సినిమాల్లో ఏ ముహూర్తాన పరకాయ ప్రవేశం చేశారో గాని ఆ ఉక్కు ముక్కలు ఇక్కడ మెత్తబడుతున్నాయి'

''రావోయ్ చపలం. ఏమిటి పొద్దున్నే చుక్క పొడవలేదు. ఇంటిముందు ఆగిపోయి పొడిపించేస్తున్నావ్!'' పకాలున మాయల పకీరు నవ్వుతో అన్నాడు లింగారావు.

''సైకిలు చైను తెగడం మీరెప్పుడు చూశారు సార్?'' చేతులుకట్టుకుని అన్నాడు.

''చేతులు కట్టుకోవడాలు నాకిష్టం ఉండదోయ్! ఎప్పుడూ విప్పుకొనైనా ఉండాలి. ఎత్తుకునైనా ఉండాలి. ఆ పనికి మాలిన ప్రాసకు ముందు తానే నవ్వుకున్నాడు లింగారావు.

తప్పనిసరై నవ్విన చపలం నవ్వులో సొగసు లేదు.

''అంబుజం మేడం పెద్దగా అరిస్తే తెల్సింది. ఆ డొక్కు సైకిల్‌తో ఎలా పడుతున్నావో. ఇన్‌స్టాల్ మెంట్‌లో స్కూటర్ కొనుక్కోవచ్చు కదా''

''లోన్ ఇప్పించండి సార్! ఓవర్‌టైంలు చేసి తీర్చుకుంటాను''

తల నిలువుగా ఊపాడు లింగారావు. అడ్డం అర్థం అంగీకారమని గారపాటి హోటల్‌లో గల్లా పెట్టి దగ్గర కూర్చుండే గరటయ్య అంటుంటే ఆలకించాడు.

మరి నిలువు 'నిలో' అంగీకారమేమో తెలియడం లేదు.

కాఫీ కోసం దాకయ్యను పిలిచాడు లింగారావు. దాకయ్య ప్రవేశించి నిష్క్రమించాడు.

''సాయంత్రాలు డ్యూటీ దిగిన తరువాత ఏం చేస్తుంటావ్? అలా వచ్చి పోతే బాగుంటుందని.... అది నా మాట కాదు అంబుజం ఆంటీది''

కళ్లజోడు కుందనం చపలం కళ్లలో మెదిలింది.

తెల్లని ఆకాశంలో కురవని నీలి మేఘం ముందుకు కదులుతోంది.

ఈమధ్య కుందనం తనను పట్టించుకుంటోంది. పరవశం వెళ్ల గక్కుతోంది. మొదట్లో చపలం మైల్డ్ బ్రెయిన్‌కి విషయం అర్థంకాలేదు.

పరాయి ఆడదాని పట్ల ప్రవరాఖ్యుడిలా ఉండేవాడు. బాసు కూతురయేసరికి మెత్తపడక తప్పడంలేదు. గట్టిగా దృఢంగా ఉందామనుకుంటే గోలయ్య రూపంలో ఆఫీసు గునపాలు గుండెల్లో దిగుతున్నాయి.

లింగారావుకి తెలిస్తే ఇంకేమైనా ఉందా! ఉద్యోగం కాస్తా పీకి పడేస్తాడు. లింగారావు సుత్తి వీరభద్రరావుకి కార్బన్ కాపీ. ఆ సుత్తి సత్తుదై ఊడి పరలోకానికి పోయింది. కానీ దాని అంశ లింగారావు రూపంలో శతపోరు పెడుతూనే ఉంది. ఉనికిని నిలుపుకుంటూనే ఉంటోంది.

చేసేది అంట్లపని. అట్లకాడలా మొహం నువ్వూనూ. ఉద్యోగంలో చేరిన కొత్తలో చపలాన్ని ఎప్పుడూ తిట్టిపోసేవాడు. చేసే ఉద్యోగం మీద విరక్తి కలిగేది. ఎదురు తిరుగలేని అసహాయం తనది. లింగారావు ఎప్పుడూ బాసిజాన్ని ఝుళిపిస్తూ ఉండేవాడు. 'మెత్తవాడిని చూస్తే మొట్టబుద్ధి' అన్న సామెత చపలం విషయంలో ఋజువు చేసేవాడు. నుంచో నిచ్చేవాడు కాదు, కూర్చోనిచ్చేవాడు కాదు. ఎప్పుడూ సతాయిస్తూ ప్రాణాలు తోడేసేవాడు.

ఉద్యోగం వదిలిపోవాలనుందని తన సీనియర్ గోలకి మొరపెట్టుకున్నాడు. గోలయ్య చపలం పని చేసే చిట్టూ తవుడు ఫ్యాక్టరీలో యూనియన్ నాయకుడు కూడా కావడంతో పర్వతమంత అండగా అన్పించేవాడు.

తిమిరి ఇసుమున తైలంబు తీయవచ్చునని ధైర్యం నూరిపోసేవాడు. తవుడు నుండి నూనె తీయగల తాను ఇసుకలాంటి లింగారావుని ఎలా జయించాలా అని తల్లడిల్లిపోయాడు.

ఓనర్ ఇల్లు ఫ్యాక్టరీకి ఆనుకునే ఉండడంతో లింగారావుతో బాటు పనిచేసేవారి మీద అంబుజం అజమాయిషీ ఎక్కువగా ఉండేది. ఇక కూతురు కుందనం అయితే సరేసరి.

ఎవరు డ్యూటీకి ఎప్పుడు వస్తున్నారు, పోతున్నారు, ఎవరు సైకిల్ మీద ఎవరు వస్తున్నారు, సెల్‌ఫోన్ ఎవరు వాడుతున్నారు, ఎవరి నెంబర్ ఏమిటి.....కంపెనీలో లంచాల బ్యాచ్ ఎవరు అనే అంశాల మీద అంబుజానికి డేగకన్ను ఉండేది.

ఆ డేగ రెక్కల నీడలో సేదదీరే కోడిపిల్లలా కుందనం కన్పించేది.

చపలాన్ని చూసిన కొత్తలో తలుపు తటాలున వేసి పడేసింది కుందనం. ఆ దెబ్బకు గిలగిలలాడిపోయాడు.

కనీసం ఆమె వైపు గాని, ఆమె అందాల వైపుగాని ఎప్పుడూ కన్నెత్తి చూడలేదు. అయినా పేరు కుందనమైనా కుందనపుబొమ్మ పోలికలు ఏమీ లేకపోవడంతో పనిచేసేవాళ్ళకి సుత్తివేలు ప్రక్కన శ్రీలక్ష్మిలా అగుపించేది.

కానీ ఈ శ్రీలక్ష్మికి ఈడుతోడు ఎవరు అనేది వాళ్ల మెదళ్లలో కోటిడాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది.

పదవ తరగతి పడుతూ లేస్తూ పాసైన చపలం లింగారావు చేసే మాటల దాడిని ఏదోలా బలవంతాన ఎదుర్కొంటూనే ఉన్నాడు. పోనీ పారిపోదామా అంటే వెతికి వెతికి మరీ వెలికితీస్తున్నాడు. ఉండిపోక తప్పటం లేదు. అలా ఉండడంలోనే అతనిలో పట్టుదల పెరిగింది. ఆత్మస్థైర్యం అధికమైంది. ఈసారి ఏదో విధంగా నిలబడాలని ప్రయివేటుగా బిఏ కట్టాడు.

అదే విషయం లింగారావుతో చెప్పాడు.

''పదిలోనే పడిలేచావు. ఇక నీకు బియే డిగ్రీ'' నిష్ఠూరంగా అన్నాడు.

''..........''

''మా ఫ్యాక్టరీలో పనిచేసేవోడికి డిగ్రీ పాసవడం రాకూడదు. వస్తే మమ్మల్ని ఒదిలేసి పోతాడు. అది సెంటిమెంట్'' నిమ్మనూనె రాసిన మీసాల్ని మెలేస్తూ అన్నాడు.

బాసుకాదంటున్నాడు. ఏం చేస్తాడు. తనమీద తానే జాలిపడ్డాడు. బాధపడి తల్లడిల్లాడు. అసలు తనకేమిటి తక్కువ. ఉద్యోగాల్ని నమ్మకంగా సిన్సియర్‌గా చేస్తున్నాడు. కష్టపడి పనిచేస్తున్నాడు. శభాష్ అనిపించుకోవాలని ఆశపడుతున్నాడు. కానీ చలం కాస్తా చపలంలా మారుతూనే ఉన్నాడు.




ముక్కులు కారేలా బాధపడ్డాడు. కంటినీరు లేకుండా ఏడ్చాడు.

'విద్య మనిషి మీసాల్ని నిలబెడుతుంది' కిరాణాకొట్టు ఓనర్ కిష్టప్పశెట్టి అంటే ఎప్పుడో విన్నాడు. దాంతో నవ్విన నాప చేనును పండించాలని కలగన్నాడు.

లింగారావు కాదుగదా లింగమూర్తి వచ్చిపడ్డా సరే తొణకగూడదన్న నిర్ణయానికి వచ్చేశాడు. వెంటనే కరస్పాండెంట్ డిగ్రీ కట్టేశాడు.

మొత్తం సంచలనాలకు కేంద్ర బిందువు అయ్యాడు. మూడు సంవత్సరాలకి డిగ్రీ సర్టిఫికెట్ వచ్చిపడిపోయింది.

అప్పటినుండి లింగారావు ఆలోచనలు తమ ఫ్యాక్టరీ గొట్టాం దాటి పైపైకి సాగుతున్నాయి. కొత్తచపలం కన్పిస్తున్నాడు. తన

మాట కాదని పై మెట్టు ఎక్కిన కుర్రాడు అగుపిస్తున్నాడు. క్రమంగా చపలం జాతకం మారుతోంది. పోరుతప్పి పొందులాభమవుతోంది.

'చపలానికి చురుకెక్కువ...' తవుడు ఫ్యాక్టరీలో సాల్వెంట్ ఆయిల్‌లా పాకిపోయింది. క్రమంగా లింగారావు దృష్టిలో పడిపోయాడు.

''కుర్రాడు కులాసాగా ఉన్నాడు'' అంబుజం రోజూ మొగుడి దగ్గర అరిగిపోయిన గ్రామఫోన్ రికార్డులా వాగుతోంది. ప్రతిసారీ ఆ మాటలు కూతురు బుర్రకెక్కేటట్లు చూసుకుంటోంది.

''ఈరోజుల్లో బియ్యే పాసవడం అంటే మాటలా... అందులోను కరస్పాండెంట్ బియ్యే...'' తల్లి మాటలు విని ప్రక్క గదిలో వంకర్లు తిరుగుతోంది కుందనం.

కుందనానికి కుదురుతప్పుతోంది. నిమిష నిమిషానికి మనసు పారేసుకుంటోంది. పారేసుకున్న చోటే వెతుక్కుని దాచుకుంటోంది. అద్దంలో చెంపల్ని చూసుకుంది. సిగ్గుల మొగ్గలవుతున్నాయి. తనలోని మార్పు తనకి కొత్త అర్థాల్ని చెబుతోంది. కూతురు వన్నెల వెన్నియలు అంబుజానికి కమనీయంగా అనిపిస్తున్నాయి.

వెనక తేదీలు సంవత్సరాలు లెక్కగా చూసుకుంది. అట్లతద్దినాటికి కుందనానికి మూడు పదులు నిండుతున్నాయి. అట్లు పంచి ఒకటిన్నర పది కావస్తోంది. ఆయన గారికి తవుడు నుండి ఆయిలు పిండడం తప్ప ఇంకేమీ పట్టట్లేదు. తనలో తానే వాపోతోంది అంబుజం. సమయం చిక్కినప్పుడల్లా మొగుణ్ణి సతాయిస్తూనే ఉంది. కానీ ఏం లాభం? మొరటు మొగుడు.

''నీకు ఓనర్‌తో మాట్లాడి ప్రమోషన్ ఇప్పిస్తా. కుందనం కుందనపు బొమ్మలా ఉంటది. వెంటనే తాళి కట్టెయ్!'' గోలయ్య గాలి కబుర్లు చపలానికి చికాకు తెప్పిస్తున్నాయి.

''బాసుకు తెల్సిందంటే తాట తోలు కంబైన్డ్‌గా వలిచేస్తాడు''

''తాటాలేదు....తోలూ లేదు నువ్వు ఊ అంటే ఆయన ఊ''

''..........''

ఈ గోలయ్య మాటన్నాడంటే మాటే. బెండకాయ ముదిరిందంటే బాసూ లేదు... బాసు కూతురు లేదు.

చాలా రోజుల నుండి చలం గమనిస్తూనే ఉన్నాడు. తనతో కలిసి పనిచేస్తున్నవాళ్లంతా తనను కొంతదూరంగా ఉంచుతున్నారు.

ఒరే! ఏరా! అనేవాళ్లంతా ఇప్పుడు 'ఏమండీ' అని పిలుస్తున్నారు. అది భవిష్యత్తులో ఓనరుకి అల్లుడవుతాడన్న ఆలోచన కావచ్చు.

**ఏమీ చేయలేని ఓ అమాయకస్థితిలో నిర్జీవంగా రోడ్డుమీద ఊడిపడిన సైకిల్ చైన్ ను సరిచేసుకుంటాడు. కొన్ని నిముషాలు... కొన్ని క్షణాలు అక్కడే. అడుగుపడదు. సైకిలు కదలదు. ఆ దృశ్యాల్ని చూసి పక్కున నవ్వుతుంది. కుందనం తన నల్లకళ్లజోడును సరిచేసుకుంటూ. చెమటలు పట్టాయి చపలానికి. తిరగని సైకిల్ చక్రం కంటి ముందు గిరగిరా తిరుగుతుంది.**

''నీకు కావలసినంత కట్నం ఇస్తాడు. ఈ చిట్టా తవుడూ బస్తాలకి నువ్వే జనరల్ మేనేజరివి'' లింగారావు గారిని ఒప్పిస్తాను. గోలయ్య వెంటపడి మరీ వేధిస్తున్నాడు.

అందరూ ఒకరికి మించి మరొకరు ఆరాతీస్తున్నారు. చపలానికి పాలుపోవడం లేదు. ఇక లాభం లేదనుకుని వాళ్ళ సంగతి లింగారావుతో చెప్పాలని నిశ్చయించుకున్నాడు.

''చూడండి సార్! ఆ మాటలు మీరేమీ పట్టించుకోకండి. వాళ్లంతా అలా వాగుతారంతే. నేను ఆ ఉద్దేశ్యంతో లేను. నా మాట నమ్మండి'' డీలా ఫేస్ పెట్టి అన్నాడు.

''అదేమిటోయ్! ఈ కాలపు కుర్రాళ్ళు చాలా ఫాస్ట్‌గా నిర్ణయాలు తీసుకుంటుంటేనూ!''

అర్థంకాలేదు చపలానికి. అనుమానంగా ఆయన కళ్ళల్లోకి చూశాడు. ఆ ఫకీరునవ్వు అర్థం కావడం లేదు.

''అర్థంకావడం లేదు కదూ!''

అడ్డమూ నిలువూ కాక అదో టైపులో తలూపాడు.

''సరే. సాయంత్రం ఇంటికి రా మాట్లాడుకుందాం. రేపు దసరా పండక్కి నీకు స్కూటర్ లోన్ గ్రాంట్ చేస్తున్నాను''

''స్కూటరేంటి! కావాలంటే కారు కొని పడేస్తాడు''.

గోలయ్య మాటలు గుర్తుకువచ్చాయి. ఉడుకు మోత్తనం పెల్లుబుకుతోంది. గట్టిగా అరవాలనుంది. కానీ మిషన్లు ఆగిపోతాయని గమ్మునున్నాడు.

''లింగారావు ఇంటికి సాయంత్రం...'' చపలానికి చెమటలు పట్టాయి. చొక్కా తడిసిపోయింది. కానీ తప్పదు. తప్పించుకోలేదు. సద్దాం హుస్సేన్ ఎక్కడో దాక్కున్నాడు. కానీ అమెరికా సైన్యం వెంటాడి వెంటాడి పట్టుకున్నారు. అసలే తాను బక్క ప్రాణి. కళ్లలో నీళ్ళు లేవు. కానీ ఏడుపు తన్నుకొస్తోంది.

కుందనం కళ్లముందు మెదిలింది. కంటికి కూలింగ్ కళ్లజోడు పెద్ద స్టయిలు. చిలకలూరిపేట కూడలి బొడ్డురాయి పర్సనాలిటీ సైకిల్ మీద డ్యూటీకి వెళుతూ వాళ్లింటిదగ్గర స్పీడు పెంచుదామనుకుంటాడు. కానీ అదేమిటో అక్కడే సైకిలు చైన్ కట్ అయిపోతుంది. టైరులో గాలి తగ్గిపోతుంటుంది. అంతే ఆగిపోతాడు. దీనంగా తనకేసి.... తనసైకిల్ కేసి ఆ ఇంటికేసి చూస్తాడు.

ఏమీ చేయలేని ఓ అమాయకస్థితిలో నిర్జీవంగా రోడ్డుమీద ఊడిపడిన సైకిల్ చైన్ ను సరిచేసుకుంటాడు. కొన్ని నిముషాలు... కొన్ని క్షణాలు అక్కడే. అడుగుపడదు. సైకిలు కదలదు. ఆ దృశ్యాల్ని చూసి పక్కున నవ్వుతుంది. కుందనం తన నల్లకళ్లజోడును సరిచేసుకుంటూ. చెమటలు పట్టాయి చపలానికి. తిరగని సైకిల్ చక్రం కంటి ముందు గిరగిరా తిరుగుతుంది.

''ఏం చేస్తాడు. బాస్ ఈజ్ ఆల్వేజ్ రైట్...ఆయన మాట, ఆయన వాళ్లమాట విని తీరాల్సిందే!''

''ఏమండీ బాబు వచ్చాడు'' అంబుజం అరుపులా కేకేసింది.

''రండి....రండి'' నవ్వుతూ వచ్చి వాలింది కుందనం. శోభానాయుడు నాట్యభంగిమలా వంకర్లుపోతోంది.

నిటారుగా నిలబడ్డాడు.

''కూర్చోవోయ్!'' లింగారావు మాటలు వింతగా ఉన్నాయి''

''నీకు ప్రమోషన్ ఇచ్చి పదివందలు పెంచుతున్నాను. నీకు ఒక్కటే చెప్పేది. కుర్రాడివి త్వరగా నిర్ణయాలు తీసుకోవాల్సిన వాడివి. పైకి రావాల్సిన వాడివి'' అస్తమానూ అనే ఆ మాటలకి అర్థం తెలియడం లేదు చపలానికి. ఒక్కసారి ఆశ్చర్యంతో మునిగిపోయాడు. మొన్నటివరకూ ఎదుటపడితేనే అమ్రీష్‌పురిలా రెచ్చిపోయే ఈ పెద్దమనిషికి ఒక్కసారిగా ఇంత ప్రేమ పుట్టుకరావడం...

''ఫ్యాక్టరీలో నీ బాధ్యతల్ని పెంచుతున్నాను''

''ఫాస్ట్‌గా నిర్ణయాలు తీసుకోవలసిన వాడివిగా....'' ప్రక్కన అంబుజం అందుకుంది. కుందనంలో సిగ్గులు మొగ్గల స్థితిని దాటి పూవులు పూస్తున్నాయి.

''అమ్మాయికి అదేదో గోడకేసి కొట్టే బంతులాటట... సాయంత్రాలు వచ్చి నేర్పాలి నువ్వు''

అంబుజం ఉన్నవీ లేనివీ అన్నీ తినమంటూ తెచ్చిపడేసింది. అన్నీ తినాలిట.

''మీ కూలింగ్ స్పెక్ట్స్ బాగున్నాయి... హాట్సాఫ్!''

''రియల్లీ'' నవ్వింది.

అంబుజంలో అంబరమంత ఆనందం తొణికిసలాడుతోంది. ఇంతకాలం గోలయ్య చేత చెప్పించిన మాటలు అన్నీ చపలం మీద బాగానే పనిచేస్తున్నాయని గ్రహించి ఆనందపడింది.

''రోజూ వచ్చి పోతుండు బాబూ... నువ్వు పరాయివాడివి కాదు మాకు!''

''మీరు ఆ డొక్కు సైకిల్ మార్చేయాలి. ఐ హేట్ దట్'' నవ్వింది కుందన.

ఎగిసిపడే ఉద్రేకం. ఆ వెనుక నీరసం... నిర్లిప్తత చపలాన్ని అయోమయంలోకి నెట్టేస్తున్నాయి. అలానే అనలేక.... కాదనలేక బయటపడ్డాడు.

మొత్తం మీద లింగారావు గారికి కాబోయే ముద్దుల అల్లుడు అనే పేరు వచ్చేసింది. నిప్పుల్లేకుండానే పొగ కమ్మేస్తోంది. గోలయ్య పొగను ఎగదోస్తున్నాడు.

బాబోయ్ అని అరవాలనిపించింది. కానీ బాసు.

ఆ పొగతో కళ్ళు ఎరుపెక్కుతున్నాయి. తన జీవితంలో అనివార్యమైనదీ తప్పనిదీ...తప్పించుకోలేనిదీ మమేకం కాక తప్పడంలేదు. ఉద్యోగం... ఉద్యోగస్తుల శతవిధాల పోరు.

మరోవైపు అంబుజం. కుందనం...అక్కడ మరో పోరు చివరికి వీరప్పన్ బందీలో చిక్కిన వీరమణిలా తయారయ్యాడు.

* * *

అసలేం అర్థం కావడం లేదు లింగారావుకి. అంతా ఆశ్చర్యంగానూ అసహనం గాను ఉంది. ఇన్నాళ్ళు ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. ఇలా అవుతుందని ఊహించలేదు. అంబుజానికైతే సరేసరి.

కుర్రాడు బాగా ఉన్నాడు. అల్లుడయితే బాగుండున నిపించింది. ఆశ పడడంలో తప్పులేకపోయినా అతని మనసుని అంచనా వేయడంలో తప్పు జరిగి పోయింది. అందుకే చేస్తూన్న ఉద్యోగం మీద విరక్తి చెంది ఎవరికీ చెప్పా పెట్టకుండా మరో చోట ఉద్యోగం వెతుక్కుని రాజీనామా చేసి మరీ పోయాడు.

కుందనం అయితే చపలాన్ని మనసారా ప్రేమించింది. ఇప్పుడు వస్తూన్న టీవీ సీరియల్స్ అన్నీ క్షుణ్ణంగా చూసి మరీ మనసు పారేసుకుంది. కానీ మోసపోయింది. అల్లుణ్ణి చేసుకుని ఆస్తి ఇద్దా మనుకున్నాడు లింగారావు. అందులో భాగంగానే ప్రమోషన్...స్కూటర్‌లోన్! కానీ కథ అడ్డం తిరి గింది. మధ్యలో గోలయ్య చేసిన గోల కొంత బెడిసి కొట్టింది. చివరికి అందరి అక్కసు గోలయ్య మీదికి మళ్లింది.

అందరూ మరచిపోవడానికి ప్రయత్నిస్తు న్నారు. కానీ ఆ షాక్ నుండి తేరుకోవడం వాళ్ళ వల్ల కావడంలేదు.

* * *

ఆరునెలల తర్వాత చపలం నుండి వచ్చిన ఉత్తరం లింగారావుని ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఇప్పటికీ నమ్మబుద్ధి కావడంలేదు.

"లింగం గారికి రాయునది.

సైకిల్ నుండి లేపి నన్ను స్కూటర్ మీద కూర్చో బెట్టారు. ధన్యవాదములు.

యజమాని అంటే గౌరవం అనండి, భయభ క్తులు అనండి. నీ కూతురును మనువాడవలసి రావచ్చునన్నది నేను అప్పట్లో ఊహించలేకపో యాను. ఇప్పటికీ ఆ విషయం తల్చుకుంటే నవ్వు వస్తోంది.

కుందనం మంచి అమ్మాయి. మెల్లకన్ను అమ్మా యిని మనువాడరా నీకు అదృష్టం కలిసొస్తుందని పోయిన మా మామ్మ చెప్తుండేది. అప్పటినుండి మెల్లకన్ను సుందరిని ప్రేమించి మనువాడాలని నా కోరిక.

నల్లకళ్ళజోడుతో కుందనం మొదట్లో నాకు నచ్చలేదు.

ఒకసారి కళ్లజోడు లేకుండా చూశాను. నేను కోరుకున్న మెల్లకన్ను ఆమెలో చూసి పొంగిపో యాను. నాలో ప్రేమలావా లాగా ఎగిసిపడింది. అప్పటినుండి ఎవరికీ చెప్పకపోయినా మనసులోనే ఆమెను మనువాడేశా!

పైకి అంటే గోలయ్య గొడవ ఉండేలు దెబ్బ లాంటిది.

గబ్బు చేసి వదులుతాడనే భయం. మరోవైపు బాసు కూతురును మనువాడి జీవితంలో పైకి వచ్చే శాడన్న అపవాదు. నా కాళ్లమీద, నా వ్యక్తిత్వంతో నిలబడి కష్టపడి పైకి ఎదగాలన్న ఆలోచనలు ఉద్యోగరీత్యా నన్ను మీకు దూరం చేశాయి. అందుకే మరో ఉద్యోగం వెతుక్కోవడం అనివార్య మయింది. ఇప్పుడు నా ఆశయాలు పూర్తిగా నెరవే రాయని భావిస్తున్నాను.

ఇక ముహూర్తాలు పెట్టించండి.
మా అత్తగారిని అడిగినట్లు...
ఆవిడని పొగిడినట్లు చెప్పండి.
ఇక గోలయ్య.... బాబోయ్ ఏమీ వద్దు

ఇట్లు
మీ అల్లుడు
- చ(ప)లం"

★


## రచయితల చిరునామా

**పుస్తకాలు**
ముక్తవరం పార్థసారథి
411, ప్రభాత్కర్ అపార్ట్‌మెంట్స్,
విజయనగర్ కాలనీ,
హైదరాబాద్ - 500 057.

**దోషికి శిక్ష తప్పదు**
ఆర్. రమణీమోహన్
కేరాఫ్ రాణి మోహనరావు
ప్లాట్ నెం.168 / ఫేజ్-1
సాకేత్, ఇసిఐఎల్ పోస్ట్,
హైదరాబాద్ - 500 062.

**ఒడువని దొరిర్కం**
జూపాక సుభద్ర
13-6-462/ఎ/27,
భగవాన్‌దాస్‌బాగ్, తాళ్ళగడ్డ,
హైదరాబాద్ - 500 267.

**శతపోరు**
వడలి రాధాకృష్ణ
ఐటిసి లిమిటెడ్,
ఐఎల్‌టిడి డివిజన్,
చీరాల - 523 157.